సాక్షి అనకాపల్లి

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ఫిర్యాదు చేస్తే పట్టించుకోవాలా?

ప్రభుత్వ భూముల ఆక్రమణ ఫిర్యాదీలపై గొలుగొండ తహసీల్దార్ మండిపడ్డారు. ఆగ్రహించిన ప్రజలు ఆందోళనకు దిగారు. 8లో



విలక్షణ నటుడు శోభన్‌బాబు

గోపాలపట్నం: శోభన్‌బాబు చిత్రపటానికి అభిమానులు నివాళులర్పించారు. విభిన్న పాత్రలు పోషించిన విలక్షణ నటుడని కొనియాడారు.



సాగరంలోకి కలుషిత జలం

ఏయూక్యాంపస్: నగరంలోని మురుగు నీరంతా సాగరంలోకి కలుస్తోంది. వ్యర్థ జలాలను నేరుగా పైపులతో వదిలేస్తున్నారు.

న్యూస్‌రీల్

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్‌కు గడువు ఈనెల 28

తుమ్మపాల: ఈనెల 28వ తేదీలోగా ప్రభుత్వ పింఛనుదారులు తమ జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాలను (లైఫ్ సర్టిఫికెట్లు) ప్రభుత్వ ఖజానా కార్యాలయానికి సమర్పించాలని జిల్లా ఖజానా, గణాంక అధికారి వి.ఎల్.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు సకాలంలో పత్రాలను సమర్పించి పింఛను ఆగిపోకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న పింఛనుదారులు సంబంధిత ఖజానా అధికారికి తెలియపరిస్తే నేరుగా వారు పింఛనుదారుల వద్దకు వచ్చి జీవన ప్రమాణ పత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. బయోమెట్రిక్ సమస్యపై నేరుగా కార్యాలయానికి రావాల్సిందేనని తెలిపారు.

ఉపమాకలో తిరుమల దర్శన కౌంటర్

- టీటీడీ చైర్మన్‌ను కోరిన హోం మంత్రి అనిత



టీటీడీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి: టీటీడీ అనుబంధ ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల దర్శన టికెట్లు విక్రయించే కౌంటరు ఏర్పాటు చేయాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. సోమవారం ఆమె స్థానిక నాయకులతో టీటీడీ చైర్మన్‌ను కలిశారు. మార్చి 10న ప్రారంభమయ్యే ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఉపమాక ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకునే సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి వివరించారు. ఆలయానికి వచ్చే ఉత్తరాంధ్ర భక్తుల కోసం ఉపమాకలో టీటీడీ ఆధ్వర్యంలో టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు విక్రయించే అవకాశం కల్పించాలని కోరారు. ఇక్కడ లడ్డూ విక్రయాలు నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపమాక కల్యాణోత్సవాలకు రావాల్సిందిగా టీటీడీ చైర్మన్ నాయుడును కోరామన్నారు. తమ ప్రతిపాదనలపై వెంటనే స్పందించిన చైర్మన్ టీటీడీ చీఫ్ ఇంజినీర్, జేఈవోలను రప్పించి ఉపమాకలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారన్నారు. హోమ్ మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్‌లు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి తదితరులు ఉన్నారు.

గంజాయి నిర్మూలనలో కూటమి ప్రభుత్వం విఫలం

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న



దేవరాపల్లి: గంజాయి నిర్మూలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. విశాఖ సెంట్రల్ జైలు కెపాసిటీ సుమారు 1300 కాగా, అక్కడ 2వేల మంది ఖైదీలు ఉన్నారన్నారు. అందులో 1200 మందికి పైబడి గంజాయి కేసుల్లో పట్టుబడిన అమాయక గిరిజనులేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించినా క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. మాదక ద్రవ్యాల మత్తుకు యువత బానిసవుతుందని, వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబరచడం లేదని ఆరోపించారు. ప్రజల భాగస్వామ్యంతో డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపడం ద్వారానే నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం వస్తుందని ఆశ చూపి గంజాయి రవాణాలో గిరిజన యువతను వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు.

స్పెషల్ పర్పస్ వెహికల్ కమిటీ ఏర్పాటు

అల్లిపురం: గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా కలెక్టర్, డైరెక్టర్‌గా మెట్రోపాలిటన్ కమిషనర్(వీఎంఆర్‌డీఏ), మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా జీవీఎంసీ కమిషనర్, డైరెక్టర్లుగా జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, చీఫ్ ఇంజినీర్‌తో పాటు మరో ఇద్దరు వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంగమ్మ గలగలలు

తుపానులు కురిపించిన వరుస వానలతో జిల్లాలో భూగర్భ జలాలు మెరుగుపడ్డాయి. సగటున జిల్లా మొత్తం 0.71 మీటర్ల మేర నీటిమట్టం పెరిగింది. కొన్ని మండలాలు, ప్రాంతాల్లో అయితే ఈ పెరుగుదల గణనీయంగా ఉంది. జనవరి మాసాంతానికి భూగర్భ జల గణాంకాల శాఖ తీసిన తాజా లెక్కల ప్రకారం జలమట్టంలో పెరుగుదల నమోదైంది. జిల్లాలో దేవరాపల్లి మండలం తామరబ్బ గ్రామం వద్ద అత్యధికంగా 21.41 మీటర్ల లోతులో జలాలు ఉండగా, కశింకోట మండలం ఏఎస్ పేట గ్రామం వద్ద కేవలం 0.45 మీటర్ల లోతులోనే జలసిరి అందుబాటులో ఉన్నట్టు అధికారులు నమోదు చేశారు.



యలమంచిలి మండలం పులపర్తి సమీపంలో పంట పొలంలో బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

- డిసెంబరులో కురిసిన వర్షాలతో స్థిరంగా భూగర్భ జలాలు
- జిల్లాలో సగటున 4.83 మీటర్లలోనే అందుబాటులో జలం
- వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదంటున్న అధికారులు

యలమంచిలి రూరల్: జిల్లాలో గత మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడం, నదులు, కాలువలు, నిండుగా ప్రవహించడం, చెరువులు నీటితో నిండటంతో భూగర్భ జలాలు పైపైనే దొరుకుతున్నాయి. దానికితోడు డిసెంబరులో కురిసిన వర్షాలతో నీటిమట్టాలు మరింత మెరుగుపడ్డాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వర్ష రూపంలో వచ్చే ప్రతి నీటి బొట్టును ఒడిసిపడుతూ భూమిలో ఇంకేలా జలసంరక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా జలసంరక్షణ పనులకు ప్రాధాన్యమిచ్చారు. గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షపునీరు భూమిలో ఇంకేలా పెద్ద సంఖ్యలో ఇంకుడుగుంతల నిర్మాణం సైతం చేపట్టారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో భూగర్భ జలమట్టం పైపైకి ఎగబాకడానికి దోహదపడింది.



యలమంచిలి మండలం పీఎన్‌ఆర్ పేట సమీపంలో బావిలో నీరు

దీంతోపాటు వరుణుడు కరుణిస్తుండటంతో పాతాళగంగ పదిలంగా ఉంది. 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఏటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో అన్ని ప్రాంతాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంటోంది. ఈ ఏడాది జిల్లాలో 1163.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు **ఆశాజనకంగా** ఉన్నాయి. జిల్లా సాధా**రణ వర్షపాతం 997.48** మిల్లీమీటర్లు కాగా ఈ **ఏడాది 16.61 శాతం అ**ధికంగా వర్షపాతం నమో**దైంది. ముఖ్యంగా గత డి**సెంబరు నెలలో తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సుమారు 10 రోజులు వర్షాలు స్థిరంగా కురిశాయి. ఒకేసారి భారీ వర్షం కాకుండా నెమ్మదిగా వర్షం కురవడం వలన వర్షపు నీరు భూమిలో ఇంకే శాతం ఎక్కువగా ఉంటుందని భూగర్భ జలవనరుల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా ఈ వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులకు ఆస్కారమే ఉండదని అధికారులు చెబుతున్నారు.



దేవరాపల్లిలో భూగర్భ జలమట్టాన్ని లెక్కగడుతున్న అధికారులు

భూగర్భ జలాలు ఆశాజనకం

ప్రతి నెల భూగర్భ జల మట్టాలను సంబంధిత అధికారులు అంచనా వేస్తారు. జిల్లాలో 81 పీజియో మీటర్లతో తీసిన లెక్కల ప్రకారం జనవరి నెలలో సగటున 4.83 మీటర్ల ఎత్తులో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నట్టు తేలింది. గత ఏడాది మే నెలలో సగటున 8 మీటర్ల లోతులో భూగర్భ జలం లభించేది. గతేడాది మే నెలతో పోల్చితే ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలమట్టం 3.17 మీటర్ల పైకి ఎగబాకింది. జిల్లాలో గతంతో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. కశింకోట మండలం ఏఎస్ పేటలో రాంకో సిమెంటు కర్మాగారం పరిసరాల్లో కేవలం 0.45 మీటర్లు, ఎస్.రాయవరం మండలం ఆర్.కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 0.47 మీటర్లు, నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయం వద్ద 0.72 మీటర్లు, రాంబిల్లి మండలం లాలంకోడూరు ఎస్సీ కాలనీ సామాజిక భవనం వద్ద 0.94 మీటర్ల లోతులోనే జలసిరి అందుబాటులో ఉండడం విశేషం. ఇవి కాకుండా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 12 చోట్ల 2 మీటర్లలోపే నీరు లభ్యమౌతుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా బావుల నుంచి నీరు సమృద్ధిగా వస్తుండటంతో ఈ ఏడాది వ్యవసాయ, ఉద్యాన పంటల సేద్యపు పనులకు ఎటువంటి ఇబ్బంది ఉండకపోవచ్చు.

జల సంరక్షణ పనులు ముమ్మరం కావాలి

భూగర్భ జలాల వినియోగం 70 శాతం వరకు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉంటే ఆయా ప్రాంతాలను సమస్యాత్మకమైనవిగా భూగర్భ జలవనరుల శాఖ అధికారులు పరిగణిస్తారు. 90 నుంచి 100 శాతం వరకు ఉంటే అత్యంత సమస్యాత్మకమైన గ్రామాలుగా గుర్తిస్తారు. జిల్లాలో 27 శాతం మాత్రమే జలాలను వినియోగిస్తున్నారు. దీంతో సమీప భవిష్యత్తులో జిల్లావాసులకు భూగర్భ జలాల విషయంలో ఎటువంటి సమస్య వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో వర్షపు నీరు 9 శాతం మాత్రమే భూమిలోకి ఇంకుతోంది. మిగిలిన 91 శాతం వివిధ రూపాల్లో వృథా అవుతోంది. వర్షపు నీరు వృథా కాకుండా జల సంరక్షణ పనులు పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంది. జిల్లాలో కురిసిన వర్షాల ద్వారా ఉత్పన్నమైన నీటిలో 41 శాతం నీరు ఆవిరి అవుతుండగా మరో 40 శాతం నీరు వృథాగా పోతోంది. కొంత శాతం నీరు తేమగా మారుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూగర్భజలాల వృద్ధికి జల సంరక్షణ పనులు మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

వివిధ మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఇలా..

మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనకాపల్లి	3.83
అచ్యుతాపురం	15.81
యలమంచిలి	1.37
బుచ్చెయ్యపేట	3.41
మాకవరపాలెం	2.38
చీడికాడ	1.09
చోడవరం	1.59
దేవరాపల్లి	2.93
గొలుగొండ	3.36
కె.కోటపాడు	1.84
కశింకోట	0.45
మునగపాక	2.34
నక్కపల్లి	1.92
నర్సీపట్నం	0.72
నాతవరం	2.52
పరవాడ	3.15
పాయకరావుపేట	2.21
రాంబిల్లి	0.94
రావికమతం	2.69
రోలుగుంట	1.92
ఎస్.రాయవరం	0.47
సబ్బవరం	1.91
వి.మాడుగుల	1.50
యలమంచిలి	4.99

మెరుగ్గా భూగర్భ జలాలు



జిల్లాలో మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. గత డిసెంబరులో తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో భూగర్భ నీటిమట్టాలు పెరిగాయి. ఈ వేసవి మూడు నెలల్లో ఏవిధమైన ఇబ్బంది ఉండదు. గత నాలుగేళ్లలో వేసవిలో ఎటువంటి సమస్య ఎదురుకాలేదు. జిల్లా వ్యాప్తంగా నీటి లభ్యతకు ఎటువంటి సమస్య లేదు. అయినప్పటికీ భూగర్భ జలాలను వృథా చేయకుండా అవసరం మేరకు వినియోగించుకుని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

–జి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జలగణన శాఖ, అనకాపల్లి

అతివలకు అండగా 'సఖి'

- బాధితులకు ఆశ్రయం, న్యాయసహాయం
- కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి యత్నం
- ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: అతివలకు అండగా సఖి వన్ స్టాప్ సెంటర్ ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఈ సెంటర్‌ను సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్‌సైట్ల ద్వారా జరిపే నేరాలు, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చెయ్యవచ్చునని చెప్పారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సఖి కేంద్రంలో సైకో సోషల్ కౌన్సెలింగ్, లీగల్ కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సెంటర్‌లో పోలీసు, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. 5 నుంచి 10 రోజుల వరకు ఆశ్రయం కల్పిస్తామని, భోజనం ఇతర వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు యమున, ఈశ్వరరావు, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎం.వి.మంజుల వాణి, నోడల్ అధికారి ఎల్.సుజాత పాల్గొన్నారు.



సఖి సెంటర్ నిర్వాహకురాలికి బాలల హక్కులు, చట్టాలపై పుస్తకాలను అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

కశింకోట: సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసు అధికారులను ఆదేశించారు. కశింకోట పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేసుల పురోగతిని పరిశీలించారు. సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజలను మరింత అప్రమత్తం చేయాల్సి ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయాలన్నారు. సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఈజెడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

- పెడిమికొండ అటవీ ప్రాంతంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు భూముల అన్వేషణ
- గాంధీనగరం పరిసరాల్లో పర్యటించిన అనకాపల్లి, అల్లూరి కలెక్టర్లు



పెడిమికొండ అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి, అల్లూరి కలెక్టర్లు విజయ కృష్ణన్, దినేష్‌కుమార్

నాతవరం: గాంధీనగరం సమీపంలో ఎస్‌ఈజెడ్ ఏర్పాటు కోసం 100 ఎకరాల భూ సేకరణలో భాగంగా పెడిమికొండ అటవీ ప్రాంతాన్ని అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. నర్సీపట్నం–తుని మధ్య ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపుల గాంధీనగరం సమీపంలో 3 కిలోమీటర్ల వరకు పెడిమికొండ అటవీ భూములు ఉన్నాయి. ఆ భూములను అటవీశాఖ అధికారులతో కలిసి ఇద్దరు కలెక్టర్లు స్వయంగా పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో కొంతమేర పెడిమికొండ నర్సరీ, మరికొంత భూమిలో జీడిమామిడి తోట ఉందని అటవీ రేంజర్ లక్ష్మీనర్సు వివరించారు. గాంధీనగరం సమీపంలో ఎస్‌ఈజెడ్ ఏర్పాటు చేస్తే తుని హైవే, విశాఖ, రాజమండ్రి పట్టణ ప్రాంతాలకు ఎంత దూరం వస్తుందని ఇద్దరు కలెక్టర్లు ఆర్డీవో వి.వి.రమణను అడిగారు. ఇక్కడ అటవీ భూమి ఎంత ఉందో, జిరాయితీ భూమి ఎంత ఉందో తెలుసుకున్నారు. తాండవ, ఏలేరు కాలువలు ఎంత దూరంలో ఉన్నాయని అడిగారు. ఎస్‌ఈజెడ్ ఏర్పాటుకు కావలసిన భూమిని రైతుల నుంచి సేకరించాలని లేదా డీపట్టా భూములు తీసుకోగా ఇంకా అవసరమయితే పెడిమికొండ అటవీ భూమిని తీసుకోవాలని భావిస్తున్నారు. అటవీ భూమిని తీసుకుంటే దానికి బదులుగా సుందరకోట పంచాయతీలో ఉన్న గ్యాప్ ఏరియా భూమి ఇచ్చేందుకు అటవీశాఖ అధికారులతో చర్చించారు.

ఎస్‌ఈజెడ్ ఏర్పాటైతే..

అటవీ ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఇక్కడ ఎస్‌ఈజెడ్ నెలకొల్పాలని యోచిస్తున్నారు. అందుకే అల్లూరి జిల్లా కలెక్టర్ కూడా స్థల పరిశీలనకు వచ్చారు. ఏజెన్సీ నుంచి వచ్చే గిరిజన ఉత్పత్తులు, మైదాన ప్రాంత రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు స్టాకు చేసి గిట్టుబాటు ధర లభించినప్పుడు పట్టణ ప్రాంతాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కె.ఉషశ్రీ, అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి, డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయర్ ప్రసాద్, ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు, ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు పాల్గొన్నారు.

కాసులిస్తేనే కరెంట్ కనెక్షన్.!

- కొత్త మీటర్ కావాలంటే విద్యుత్ అధికారుల చేయి తడపాల్సిందే..
- కూటమి నేతలతో కలిసి బరితెగిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది
- కొత్త కనెక్షన్ల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు
- అపార్ట్‌మెంట్ కనెక్షన్‌కు రూ.50 వేలు, వ్యక్తిగత కనెక్షన్‌కు రూ.5 వేల వసూలు

సార్.. కొత్తగా ఇల్లు కట్టుకున్నాం.. కరెంట్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం.. ఎప్పుడు వస్తుందని.. ఎవరైనా సాధారణ ప్రజలు అడిగితే.. 'మీ లోకల్ లీడర్ నుంచి సిఫార్సు తీసుకురా.. అప్పుడే పని త్వరగా పూర్తవుతుంది. దాంతో పాటు ఎంతో కొంత సర్దుబాటు చెయ్.. మీ ఇంటికి వెలుగులు వచ్చేస్తాయి.'

– ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బంది చెబుతున్న మాటలు ఇవి.

జోన్–1 పరిధిలో 80 అడుగుల రోడ్డు ప్రాంతానికి చెందిన ప్రసన్నకుమార్ కొత్తగా కడుతున్న గ్రూప్ హౌస్ కోసం విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. నెల రోజులైనా స్పందన రాకపోవడంతో విశాఖ సర్కిల్ కార్యాలయానికి వెళ్లి అడగ్గా.. దిగువ స్థాయి అధికారిని సంప్రదించాలని చెప్పారు. తిరిగి తిరిగి సదరు అధికారిని అడగ్గా.. మీ లోకల్ టీడీపీ లీడర్ నుంచి ఒక్క ఫోన్ చేయించండి చాలు.. మీ పనైపోతుందని అన్నారు. లీడర్ దగ్గరికి వెళ్లి బతిమిలాడారు. అక్కడి నుంచి జోన్ సిబ్బందికి ఫోన్ వెళ్లింది. వెంటనే సదరు విద్యుత్ ఉద్యోగి ప్రత్యక్షమై.. ఫార్మాలిటీస్ ఉన్నాయంటూ లెక్క చెప్పి రూ.50 వేలు కప్పం కట్టించుకున్నారు. అంతే రెండు రోజుల్లో కొత్త కనెక్షన్ వచ్చేసింది.

– ఇదీ కొంత కాలంగా ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో నడుస్తున్న దందా. కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలంటే.. కచ్చితంగా ఆ ఏరియాకు చెందిన కూటమినేత నుంచి ఫోన్ రావాల్సిందే.

సాక్షి, విశాఖపట్నం :

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో ప్రస్తుతం 18,42,691 మంది ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు, 1858 హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులున్నారు. గత ఐదేళ్ల కాలంలో కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలంటే సులువుగా దొరికేది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా.. స్థానిక ఏఈ కార్యాలయంలో సంప్రదించినా.. కేటగిరీల వారీగా ఫీజులు చెల్లించేవారు. నిర్ణీత గడువులో కొత్త కనెక్షన్ మంజూరయ్యేది. 2022 నుంచి 2024 ఏప్రిల్ మధ్య కాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 80 వేల కొత్త కనెక్షన్లు పెరిగాయి. కానీ.. ఎక్కడా లంచాలకు తావులేకుండా మంజూరు చేసేవారు. ఇప్పుడు కాలం మారిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈపీడీసీఎల్ సర్కిల్ అధికారులు కమర్షియల్‌గా మారిపోయారు. కనెక్షన్ కావాలంటే చేయి తడపాల్సిందేనని భీష్మించుకు కూర్చుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక లైన్‌మెన్‌లు, ఏఈలు దరఖాస్తులను ప్రాసెసింగ్ చేస్తున్నా.. వాటిని ఆపాలంటూ కూటమి నేతలు హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. తమ ఆదేశాలు వచ్చేంత వరకూ కొత్త దరఖాస్తుల జోలికి వెళ్లొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారంట. అందుకే విశాఖ సర్కిల్ పరిధిలో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

కూటమి నేతలతో కుమ్మక్కు!


విద్యుత్ కనెక్షన్లు ఏమైనా కొత్తవి మంజూరు చేయాలంటే కచ్చితంగా తమను సంప్రదించేలా చూడాలంటూ కూటమి నేతలు విశాఖపట్నం సర్కిల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏ దరఖాస్తు వచ్చినా దానిపై దృష్టి సారించడం లేదు. దరఖాస్తుదారులు వచ్చి తమ కొత్త కనెక్షన్ గురించి అడిగితే... కూటమి నేతలతో కుమ్మక్కై, అందినకాడికి దోచుకుంటూ పంచుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. వ్యక్తిగత కనెక్షన్‌కు కేటగిరీ బట్టి రూ.5 నుంచి రూ.10 వేలు.. అపార్ట్‌మెంట్స్, విల్లాలు, గ్రూప్‌హౌస్‌లకు విస్తీర్ణం, ఫ్లాట్లను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష కుపైగా రేటు ఫిక్స్ చేశారని తెలుస్తోంది. దీంతో ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికీ విద్యుత్ కచ్చితంగా అవసరం కాబట్టి.. ఎంత డిమాండ్ చేస్తే అంత చెల్లింపులు చేసి కనెక్షన్ తీసుకుంటున్నామని వినియోగదారులు వాపోతున్నారు.



ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ శాఖ భవన్

వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై కొరడా

- శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు



సాక్షి, విశాఖపట్నం : అవినీతి ఆరోపణలతో పాటు వేధింపులు, క్రమశిక్షణరాహిత్య ప్రవర్తన, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై ప్రభుత్వం శాఖ పరమైన చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. 2023లో విశాఖపట్నం–2 డివిజన్ పరిధిలోని అనకాపల్లి సర్కిల్‌లో విధులు నిర్వర్తించిన డివిజన్ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, డిప్యూటీ కమిషనర్ పి.జయశంకర్, జీఎస్‌టీవో పి.ప్రసన్నకుమార్, ఏఈవో జమ్ము ధర్మపాల్, ఎయిర్‌పోర్టు సర్కిల్ ఏఈవో టి.సోమేశ్వరరావుపై ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీరి అవినీతి, అధికార దుర్వినియోగంపై సీసీఎస్‌టీ అడిషనల్ కమిషనర్ ఎస్‌ఈ కృష్ణమోహన్‌రెడ్డి, కాకినాడ జాయింట్ కమిషనర్ జి.సుమతిని విచారణాధికారులుగా నియమించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం.. సదరు అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటూ రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా



ఎస్పీ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : స్థానిక ఎస్పీ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బందితో (సెక్షన్ వైస్) సోమవారం సమీక్ష సమావేశాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా నిర్వహించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. పోలీస్ సిబ్బంది అభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ, సంక్షేమ పథకాలు, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉద్యోగుల్లో స్ఫూర్తిని పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని, సమర్థంగా సేవలు అందించేందుకు తగిన మార్గదర్శకాలు, నూతన విధానాలు, సాంకేతిక వినియోగం వంటి అనేక అంశాలపై సిబ్బందితో ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏవో ఎ.రామ్‌కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్‌లు కె.వి.వరలక్ష్మి, పి.శేషు, ఎస్.వి.గిరిబాబు పాల్గొన్నారు.

20 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

చీడికాడ : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని అప్పలరాజుపురం కాటా వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన మహమ్మద్ అర్షప్, టి.ఏ బారిస్ అనే వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. వీరిద్దరూ ముంచంగుపుట్టు మండలంలో ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్టు విచారణలో తెలిసిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.



కొత్త దద్దుగుల గ్రామంలో గిరిజన మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టరు విజయకృష్ణన్

- కొత్త దద్దుగుల గ్రామస్తుల ఆశ్చర్యం
- ఆ గ్రామం వెళ్లిన మొదటి కలెక్టరు విజయకృష్ణన్
- గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ

మా ఊరికి కలెక్టరమ్మ వచ్చింది...

నాతవరం: కొత్తదద్దుగుల గ్రామాన్ని కలెక్టరు విజయకృష్ణన్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో సుందరకోట పంచాయతీ శివారు కొత్త దద్దుగుల గ్రామానికి ఒక కలెక్టరు రావడం ఇదే మొదటిసారి. దీంతో ఇక్కడి గిరిజనులు ఆశ్చర్యంగా చూశారు. గ్రామం ఏర్పడిన తర్వాత ఇంతవరకు ఏ కలెక్టరూ ఆ గ్రామానికి వచ్చిన సందర్భాలు లేవు. ఈ గ్రామం రెండు జిల్లాల సరిహద్దు దట్టమైన అటవీ ప్రాంతం కావడంతోమండల స్థాయి అధికారులు సైతం వెళ్లిన దాఖలాలు అంతంత మాత్రమే. ఈ ప్రాంతాన్ని 'గ్యాప్ ఏరియా'గా పరిగణిస్తారు. గ్రామంలో పరిస్థితులను స్వయంగా చూసి కలెక్టరు గిరిజనులతో మాట్లాడారు. జీవన విధానం, సంక్షేమ పథకాల అమలుతో పాటు సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం, అంగన్‌వాడీ కేంద్రం, తాగునీరు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. గ్రామానికి రోడ్డు లేక గర్భిణులను వైద్యానికి తీసుకెళ్లం ఇబ్బందిగా ఉందని గిరిజనులు కలెక్టర్ వద్ద వాపోయారు. ఉపాధి హామీ పథకంలో వేసిన మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు సాగించలేక పోతున్నామన్నారు. సెల్ టవరు ఏర్పాటు చేస్తే కొండల మీద ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందుతాయన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులందరికీ అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. పాడేరు ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం కల్పించే సదుపాయాలు ఇక్కడ తమకు అందించాలని కోరారు. గతంలో ఇచ్చేవారని ఇటీవల కాలంలో ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం జాఫ్రా పంట ఆదాయం బాగుందని, కేజీకి రూ.250లకు విక్రయాలు ప్రైవేటు వ్యాపారులు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఈ ఒక్క పంటే ఆదాయం వస్తుందన్నారు. దీంతో గిరిజనుల మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని ఎంపీడీవో కె.ఉషాశ్రీని కలెక్టర్ ఆదేశించారు. కొండల మీద ఉన్న గిరిజన గ్రామాల్లో పాఠశాలల పని తీరుపై ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాల బాబును అడిగారు.

నెల రోజుల్లో గ్యాప్ ఏరియా భూముల సర్వే

గ్రామాన్ని ఆనుకుని వృథాగా ఉన్న వేలాది ఎకరాల గ్యాప్ ఏరియా భూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ భూములు సర్వే చేసి రికార్డులో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీశాఖ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. నెల రోజుల్లో గ్యాప్ ఎరియా భూములు మొత్తం సర్వే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని మండల సర్వేయరు ప్రసాద్‌ను అదేశించారు. జిల్లాల సరిహద్దు విషయంలో ప్రత్యేక దృష్టి సారించి అధునిక టెక్నాలజీ సహాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో రమణ, నర్సీపట్నం రేంజర్ లక్ష్మి నర్సు, అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి, తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ పాల్గొన్నారు.



నర్సీపట్నం మండలం, బంగారయ్యపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్

నర్సీపట్నం : నర్సీపట్నం మండలం, బంగారయ్యపేటలో జరుగుతున్న భూముల రీసర్వేను జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ సోమవారం పరిశీలించారు. అధికారులు సర్వే చేస్తున్నట్టు ముందస్తు సమాచారం ఇస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సర్వే చేస్తున్నప్పుడు రైతులు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. లోటుపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణ ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుధ్యం మెరుగు



గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న నాగలక్ష్మి, డీపీవో శిరీషారాణి

కె.కోటపాడు : పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలకు తడి, పొడి చెత్తను వేర్వేరు డస్ట్‌బిన్‌లలో వేసి ఇచ్చి పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. అనకాపల్లి డివిజన్‌లో గల 11 మండలాల్లో గల పంచాయతీ విస్తరణాధికారులు, ఆయా మండలాల్లో ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శిలు, క్లాప్‌మిత్రలకు చొడువాడలో సోమవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి, శిరీషారాణి మాట్లాడుతు గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాల్లో వేర్వేరుగా ఉంచాలని తెలిపారు. పాడి రైతుల నుంచి సేకరించిన పేడను సంపద తయారీ కేంద్రాల్లో 70 నుంచి 80 రోజుల పాటు ఉంచిన తరువాత వర్మీగా తయారవుతుందన్నారు. ఈ ఎరువును రైతులకు కిలో గరిష్టంగా రూ.5లకు అమ్మకాలను చేపట్టడం ద్వారా పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. భూమిలో వర్మీకంపోస్టు వేయడం వల్ల భూమిలో పోషక విలువలు పెరుగుతాయని, తద్వారా మంచి దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన పంట లభిస్తుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలను గ్రామంలో పర్యటించి ప్రజలకు ఏ విధంగా తడి, పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలో వివరింపజేసారు. అంతకుముందు సంపద తయారీ కేంద్రం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్ పాల్గొన్నారు.

మీరు ఫిర్యాదు చేస్తే నేను పట్టించుకోవాలా?

- ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు చేసిన వారిపై తహసీల్దార్ మండిపాటు
- భూ ఆక్రమణదారులకు వత్తాసు
- ఆగ్రహించి ఆందోళనకు దిగిన ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

గొలుగొండ : గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు తీరుపై నాగాపురం పంచాయతీ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన నాయకులు, ప్రజలపై తహసీల్దార్ మండిపడ్డారు. మీరు ఫిర్యాదులు ఇస్తే నేను పట్టించుకోవాలా.. నేను ఎటువంటి చర్యలు తీసుకోను? ఏం చేసుకుంటారో చేసుకోండి అని తెగేసి చెప్పడంతో హతాశులైన గ్రామస్తులు తహసీల్దార్ తీరును నిరసిస్తూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహసీల్దార్ డౌన్..డౌన్ అని నినదించారు. నాలుగు గంటల పాటు కార్యాలయం మెట్లపై ఆందోళన చేశారు.

వివరాలివీ...

నాగాపురం పంచాయతీ శివారు పల్లావూరు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉంది. అక్కడే తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయం ఉంది. అక్కడ ప్రజలకు ఇపయోగపడే విధంగా మరో 10 సెంట్లు స్థలం ఉంది. దీనిని పల్లా దేముడు అనే వ్యక్తి ఆక్రమించాడని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. అయితే తహసీల్దార్ వారిపై మండిపడ్డారు. మాజీ సర్పంచ్ కొలగాన రామారావు, ప్రస్తుతం సర్పంచ్ యలమంచిలి రఘురాంతోపాటు అన్ని పార్టీల నేతలు ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్ ఆక్రమణదారులకు వత్తాసు పలకడంపై ఫిర్యాదుదారులు ఆందోళన చేశారు. గొలుగొండ ఎస్ఐ రామారావు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని ఆందోళనకారులు హెచ్చరించారు.

బేడ జంగం కులస్తులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



జార్జిక్లబ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దుడ్డు కొండయ్య

అనకాపల్లి: రాష్ట్రంలో బేడ(బుడ్గ) జంగం కులస్తుల విద్యార్థులకు 17 సంవత్సరాలుగా కుల ధృవీకరణ(ఎస్సీ) పత్రాలను ప్రభుత్వం అంజేయడం లేదని, జేసీ శర్మ కమిషన్ నివేదిక ప్రకారం కుల ధృవీకరణ పత్రాలను అందజేయాలని ఏపీ బేడ(బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దుడ్డు కొండయ్య అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బేడ జంగం కలస్తుల విద్యార్థులకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రం ఉత్తరాంధ్ర జిల్లాలో అందజేసేవారని, ప్రస్తుతం అందజేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 17 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. సుప్రీంకోర్టులను ఆశ్రయించడంతో గతంలో ఉన్నట్టుగా కుల ధృవీకరణ పత్రాలను అందజేయాలని జెసీ శర్మ కమిషన్ సిఫారసలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పారావు, కార్యదర్శి శేర్ల అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో రోగి మృతి

- మృతదేహం ఇచ్చేందుకు రూ.5 లక్షల డిమాండ్
- కుటుంబ సభ్యుల ఆందోళన

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో ఒక రోగి మృతి చెందడం ఆందోళనకు దారి తీసింది. ఆస్పత్రి యాజమాన్యం మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5 లక్షలు డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి.. చోడవరానికి చెందిన బండి శ్రీధర్ (55) గుండెనొప్పితో బాధపడుతుండగా, ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కుటుంబ సభ్యులు హెల్త్ సిటీలోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి అత్యవసరంగా గుండె శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ముందుగా ఆస్పత్రికి రూ.60 వేలు చెల్లించారు. అర్ధరాత్రి 12.30 నుంచి ఒంటి గంట మధ్య సమయంలో ఐసీయూలో ఉన్న శ్రీధర్‌ను చూడటానికి కుటుంబ సభ్యులు వెళ్లగా.. అతను మృతి చెందినట్లు గుర్తించారు. వైద్యులను సంప్రదించగా వారు పరిశీలించి శ్రీధర్ మరణించినట్లు నిర్ధారించారు. శ్రీధర్‌కు రెండు శస్త్రచికిత్సలు చేశామని, వాటికి సంబంధించిన ఫీజు చెల్లించాలని వైద్యులు సూచించారు. మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన శ్రీధర్ కుమారులు 'గుండె జబ్బు నయం చేస్తామని చెప్పి మా నాన్నను చంపేశారు' అంటూ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం బంధువులకు తెలియడంతో చోడవరం నుంచి సోమవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. మృతదేహం కోసం డబ్బులు చెల్లించమని, వెంటనే మృతదేహాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ కృష్ణ సిబ్బందితో కలిసి కేర్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాధితులు, ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. ముందు చెల్లించిన రూ.60వేలతో పాటు అదనంగా రూ.1.10 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి బంధువులు అంగీకరించారని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. శస్త్రచికిత్స చేసే సమయంలో అంగీకార పత్రంపై సంతకాలు తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు.

శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షునిగా నీలాచలం

అనకాపల్లి : శ్రీ భాగవతుల చాత్తాడ శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షునిగా నీలాచలం వెంకటరమణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గాంధీనగరం సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా తిరుపతి గౌరసోమశేఖర్, కోశాధికారిగా సన్నిధి ఈశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా ఎం.జగన్‌మోహన్‌రావుతో పాటు మరో 15మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చే స్తున్నట్టు తెలిపారు.

కక్ష సాధింపులకు పాల్పడితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న బొట్టా నాగరాజు

నర్సీపట్నం : రాష్ట్రంలో బహుజన అధికారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని బహుజన ఐక్యవేదిక నాయకులు బొట్టా నాగరాజు పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బహుజన అధికారి అయిన సీఐడీ చీఫ్ ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్‌పై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోస్టింగ్ ఇవ్వాకుండా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. అట్టడుగు వర్గాల సమాజం బాగుపడాలని నిరంతరం కృషి చేస్తున్న పి.వి.సునీల్ కుమార్‌పై కక్ష కట్టి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.అధికారులు రాజ్యాంగానికి లోబడి ఉద్యోగాలు చేస్తారన్నారు. అలాంటివారిని ఇబ్బందులు పెడితే రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్టేనన్నారు. పి.వి సునీల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉత్తమ పోలీసు అధికారిగా ఎన్నో అవార్డులు అందుకున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ వేధింపులు ఆపి పోస్టింగ్ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో బహుజనులంతా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు సాగిస్తామన్నారు. ఇదే ధోరణి కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎస్.చిరంజీవి, వి.సంజీవ్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆనకట్ట పూర్తి చేయాలి..



ఆనకట్ట నిర్మాణ పటిష్ఠతను పరిశీలిస్తున్న నాయకులు



ఆనకట్ట వద్ద జరుగుతున్న రక్షణ గోడ పనులు



గత ప్రభుత్వంలో ఆనకట్ట నిర్మాణానికి వేసిన శిలా ఫలకంను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

- మంగళాపురం ఆనకట్ట పనులను పరిశీలించిన
- వైఎస్సార్‌సీపీ నాయకులు
- గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు నిధులు మంజూరు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మంగళాపురం ఆనకట్ట నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతు సంఘ నాయకులు పరిశీలించారు. తొంభై శాతం పనులు పూర్తవగా మిగిలిన పనులు నెలాఖరులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూడేళ్ల కిందట మంగళాపురం ఆనకట్ట భారీ వర్షాలకు దెబ్బతింది. ఆనకట్ట దిగువన ఉన్న మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట, లక్ష్మీపురం, సురవరం, నరసయ్యపేట తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది రైతులకు సాగు నీరు అందలేదు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన ఆనకట్ట దెబ్బతినడంతో కోనాం రిజర్వాయర్ నీరు అందక రైతులకు తీవ్ర నష్టం జరిగేది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విజయరామరాజుపేట, మంగళాపురం సర్పంచ్‌లు ఎల్లపు విజయ్‌కుమార్, కంటే పద్మరేఖ వెంకట్, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవిందలు పలువురు నాయకులు, రైతులతో కలిసి సాగు నీటి కష్టాలను అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ధర్మశ్రీ కృషితో అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి మంగళాపురం ఆనకట్ట మరమ్మతు పనులకు తన ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేశారు. 2023 నవంబర్ 21వ తేదీన అప్పటి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మండల నాయకులతో కలిసి ఆనకట్ట పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఆనకట్ట నిర్మాణ గోడ ఎప్రాన్‌తో పాటు రక్షణ గోడ పనులు, రాతి పేర్పు పనులు జరగ్గా వీటి నాణ్యత సామర్థ్యాన్ని విజయరామరాజుపేట, మంగళాపురం సర్పంచ్‌లు విజయ్‌కుమార్, పద్మరేఖ వెంకట్, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గోవింద, రైతు సంఘ నాయకులు సోమవారం పరిశీలించారు. 3 వేల ఎకరాలకు సాగు నీరందించే ఆనకట్ట పనులు పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు. ఆనకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ సత్యవతి,ఎమ్మెల్యే ధర్మశ్రీకి నాయకులు,రైతు సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పేట ఉప సర్పంచ్ దొడ్డి జగన్నాధరావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట కృష్ణ రైతు సంఘ నాయకులు ఎల్లపు చిరంజీవి, వేగి అప్పారావు, గాడి ప్రసాద్, మధుమంతి నాయుడు, పత్తి జగన్నాథరావు, వేగి రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె' విస్తృత ప్రచారం



బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు

డుంబ్రిగుడ: ఎమ్మెల్సీగా మరోసారి తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలుర, బాలికల, కేజీబీవీ, డుంబ్రిగుడ, అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన ఆయా పాఠశాలల బయట ఉపాధ్యాయులతో మాట్లాడారు. కేజీబీవీలలో పని చేస్తున్న సీఆర్‌టీలకు మినిమం టైం స్కేల్ వర్తించేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా బీమా సదుపాయం కల్పించి ఉపాధ్యాయులకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులకు 15 రోజుల సాధారణ సెలవులపై స్పష్టతనిచ్చి అమలయ్యేలా చూస్తామన్నారు. పీఆర్‌టీయూ అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరి, అప్పలరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, రాష్ట్ర కౌన్సిలర్ జి.గెన్ను, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శి లక్ష్మయ్య, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ బ్యాంక్ పేరుతో మోసాలు

- ముగ్గురు ముఠా సభ్యుల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు

గోపాలపట్నం: రిజర్వ్ బ్యాంక్ ద్వారా కోట్లాది రూపాయలు, విల్లాలు ఇప్పిస్తామని.. రూ.5 వేలు కడితే కోటి వరకు నజరానా వస్తుందని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సోమవారం టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. రెండు రాష్ట్రాల్లో ఓ ముఠా రైస్ పుల్లింగ్, రిజర్వ్ బ్యాంక్ సర్టిఫికెట్లు వంటి పలు రకాల మోసాలకు పాల్పడుతోంది.

ఇందులో కొందరు ముఠా సభ్యులు విశాఖలో ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మద్రిపాలెం వుడా లేఅవుట్ పార్క్ సమీపంలో ఒక ఇంటిపై దాడి చేశారు. విశాఖకు చెందిన లక్ష్మీ ప్రసన్న, కోటేశ్వరరావు, కాకినాడకు చెందిన శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన యడ్లపల్లి నారాయణ మూర్తి పరారయ్యాడు. వీరు గతంలో పలు చోట్ల దొంగ నోట్లు చలామణి చేయడం, రూ.5వేలు, రూ.10 వేలు కడితే కోట్ల రూపాయలు వస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడ్డారు.

వీరు విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని ప్రజలను ఏమార్చుతున్నారు. కాగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా బారిన పడిన బాధితులు ఎంతమంది ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట : తాళ్లపాలెం వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. అనకాపల్లి -యలమంచిలి మార్గంలో జాతీయ రహదారిపై తాళ్లపాలెం సమీపంలో మామిడివాక గెడ్డ వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తిని వ్యాన్ వేగంగా ఢీకొందన్నారు. దీంతో తల నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. నేరేడు పండు రంగు షర్టు, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు.

వీఆర్‌వో రాయవరపు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

క్లుప్తంగా

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

అనకాపల్లి టౌన్: అందరి సహకారంతో గ్రామాభివృద్ధి సాధ్యమని సత్యనారాయణ పురం సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సత్యనారాయణ పురం ప్రభుత్వ పాఠశాల నుంచి 165 మీటర్ల మేర నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీటీసీ జొగా నాగమణితో కలిసి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పలకా సత్తిబాబు, పోటుకూరి భవాని, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లమారమ్మతల్లి జాతర



బీఆర్టీ కాలనీలో నల్లమారమ్మతల్లి

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ బీఆర్టీ కాలనీలో మంగళవారం నిర్వహించే నల్లమారమ్మతల్లి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రతినిధి రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, సత్యనారాయణపురం, పిసినికాడ పంచాయతీ భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశామన్నారు.

20న జీడి మామిడి ఫలసాయానికి వేలం

నర్సీపట్నం: మండలంలోని లింగాలతిరుగుడులో వేంచేసిన సోమలింగేశ్వస్వామివారి దేవస్థానానికి చెందిన జీడి మామిడి తోట ఫలసాయం అనుభవించుటకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.79లో 3.50 ఎకరాల విస్తీర్ణంలోని జీడి మామిడి తోట ఫలసాయం ఏడాదికి గాను, సర్వే నెం.70/7, 70/11లలోని 3.60 ఎకరాల జీడి మామిడి తోట మూడేళ్ల కాలానికి హక్కుల కోసం ఈ వేలం పాట జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలాన్ని దేవస్థానం వద్ద ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 9,770 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,910	4,780
మొదటి రకం	3,600	4.250
రెండో రకం	3,260	3,740
మూడోరకం	2,940	3,250

అనకాపల్లి సినిమాలు

ఇట్స్ కాంప్లికెటెడ్	:రాజా
ఆరెంజ్	:సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
కెప్టెన్ అమెరికాతెలుగు వెర్షన్	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
సూర్య కృష్ణన్	:వెంకటేశ్వర(ఉదయం)
తల	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
లైలా	:శ్రీసత్య
బ్రహ్మానందం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- మందుబాబులకు ఆవాసంగా పురాతన భవనాలు
- చిట్టడవిని తలపిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ప్రమాదకరంగా ఆర్అండ్‌బీ అతిథి గృహం
- పట్టించుకోని పాలకులు



నిరుపయోగంగా ఆర్అండ్‌బీ అతిథిగృహం



కూలేందుకు సిద్ధంగా పురాతన భవనం



చిట్టడవిని తలపిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అనకాపల్లి టౌన్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అనకాపల్లి పరిస్థితి తయారైంది. ఇక్కడ బెల్లానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం అనకాపల్లి బెల్లాన్ని కీర్తించారు. అంతటి పేరు ప్రఖ్యాతులు కలిగిన ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టు భవనాల సముదాయం, ఆర్అండ్‌బీ అతిథిగృహం, పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనాలు పూర్తిగా శిథిలమై నిరుపయోగమయ్యాయి. ఇవి రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మరోవైపు ఆయా శాఖలు అద్దె కొంపల్లో అరకొర వసతులతో నడుస్తున్నాయి.

◆ **పట్టణ వాసుల భయాందోళన**

ఇక్కడ శిథిలమైన ప్రభుత్వ కార్యాలయాలు చీకటి పడితే మందుబాబులకు, ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. వీటిని కూల్చివేసి నూతన భవనాలు నిర్మిస్తే అద్దె రూపంలో చెల్లిస్తున్న వేలాది రూపాయల ప్రజాధనం వృథాను అరికట్టవచ్చు. అయితే విలువైన ప్రభుత్వ ఆస్తులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి నాయకులు, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దాంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రిటిష్ కాలంలో కట్టిన తహసీల్దార్ కార్యాలయం ఇప్పటికీ అదే భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఆ భవనం ఎప్పుడు కూలిపోతుందోనని బిక్కుబిక్కుమంటూ తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

◆ **అద్దె కొంపల్లో ప్రభుత్వ కార్యాలయాలు**

పట్టణంలో చాలా మటుకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రిజిస్ట్రార్ ఆఫీస్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక శాఖ, ఎక్సైజ్ ఆఫీస్, మైన్స్ కార్యాలయం, కమర్షియల్ టాక్స్ ఆఫీస్, తదితర ప్రభుత్వ కార్యాలయాలన్నీ వేలకు వేలు ప్రజాధనం వెచ్చించి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అవి కూడా అరకొర వసతుల మధ్య వీటిని నిర్వహించడం వల్ల అటు ఉద్యోగులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పురాతన భవనాలు కూల్చివేసి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కొత్త భవనాలు నిర్మించాలి

కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకొనే నాథుడే లేరు. ఏ ప్రభుత్వ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియడం లేదు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలి.

–సూదికొండ మాణిక్యాలరావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అనకాపల్లి

అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి



ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి. ఇవి వృథాగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. తక్షణమే శిథిలావస్థకు చేరిన భవనాలు కూల్చివేయాలి. నూతనంగా భవనాలు నిర్మించి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు చేపట్టాలి.

–పి. ప్రసాద్, అనకాపల్లి

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామ పరిధిలోని రెండు చెరువుల్లో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతు బుద్ధ వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. గొబ్బూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా గైరమ్మ, కారిపాలెం చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. గైరమ్మ చెరువును ఆక్రమించి రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు సర్వీసు రోడ్డు నిర్మిస్తుండగా, కారి పాలెం చెరువును రియల్టర్లు, ఇతరులు దాదాపు సగం మేర ఆక్రమించి చదును చేశారన్నారు. దీంతో ఇవి కుచించుకుపోయాయన్నారు. వీటికి వచ్చే సాగునీటి కాలువలను కొంత మేర పూడ్చి వేశారన్నారు. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక నష్టపోతున్నామని వాపోయారు. ఈ విషయమై పరిశీలన చేసి చెరువుల్లో ఆక్రమణలు తొలగించి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుబాబులపై కేసులు

అనకాపలి టౌన్: బహిరంగ ప్రదేశాలో మద్యం సేవిస్తున్న వ్యక్తులపై పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. అనకాపల్లి స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి దాబాలు, బహిరంగ ప్రదేశాలలో దాడులు నిర్వహించి, మద్యం సేవిస్తున్న 25 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఈ దాడులలో ట్రైనీ డీఎస్పీ ఎం.వి. కృష్ణచైతన్య, టౌన్ ఎస్ఐ డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయానికి ముస్తాబు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి గ్రామం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అందంగా రంగులతో ముస్తాబు చేస్తున్నారు. కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న ఆలయ వార్షికోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో రంగులు వేయడానికి బంగారయ్యపేటకు చెందిన లక్కోజు ఆదినారాయణ, నాగశ్రీ దంపతులు రూ.20 వేలు విరాళంగా సమకూర్చారు.

వెలవెలబోయిన సంత

- ఎండ తీవ్రతతో రాని ప్రజలు



తాళ్లపాలెం వారపు సంతలో విక్రయిస్తున్నప్పటి కూరగాయలు



బోసిపోయిన సంత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో సోమవారం వారపు సంత ఎండ తీవ్రతతో వెలవెలబోయింది. కొనుగోళ్లు తగ్గిపోవడంతో వ్యాపారులు తీవ్ర నిరాశ చెందారు. వేసవి ప్రారంభం కాకముందే ఎండ తీవ్రత ఎక్కువైంది. దీంతో ప్రజలు సంతకు రావడం తగ్గిపోయారు. దీంతో బేరాలు లేక ఆదాయం కోల్పోవలసి వస్తుందని వ్యాపారులు నిట్టూర్చారు. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గి ప్రజలు రావడంతో 'గుడ్డిలో మెల్లలా' కాస్త అమ్మకాలు జరగడంతో ఉపశమనం చెందారు.

బెట్టు దిగని బీరకాయ:

సంతలో బీరకాయ ధర సెంచరీకి చేరువలో బెట్టు మీద ఉంది. కిలో రూ.80కి అమ్మకాలు సాగాయి. టమాటా ధర ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. గత వారం కిలో రూ.10 ఉండగా, ఈ వారం రూ.20కి పెరిగింది. ఉత్పత్తి తగ్గడం ఇందుకు కారణంగా వ్యాపారులు పేర్కొంటున్నారు. ఉల్లి రూ.35 నుంచి రూ.40కి పెరిగింది. వంకాయ ధర పడిపోయింది. కిలో రూ.20కి అమ్మకాలు సాగాయి. బంగాళదుంప, దొండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, చిక్కుడుకాయ, చిన్న క్యాప్సికం, చామదుంప రూ.60, పెద్ద క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. చింతపండు పిక్కతో రూ.50, పిక్క తీసినది రూ.వందకు అమ్మకాలు జరిగాయి.

బేరాలు లేక తగ్గిన ఆదాయం



తాళ్లపాలెం వారపు సంతలో సరిగ్గా బేరాలు లేక ఆదాయం తగ్గిపోయింది. ఎండ తీవ్రతతోపాటు ఇతర కారణాల వల్ల ప్రజలు రాకపోవడంతో కూరగాయల కొనుగోళ్లు మందగించాయి. వేసవి రాకముందే ఇలా ఉంటే, రానున్న మండు వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

–దశాయి శ్రీను, కూరగాయల వ్యాపారి

బోసిపోయిన సంత

కశింకోట: మండలం కేంద్రంలో రోజు వారీ సంత ఎండ తీవ్రతకు సోమవారం బోసిపోయింది. ఉదయం 11 గంటల నుంచి ఎండ తీవ్రత పెరగడంతో కూరగాయల దుకాణాలు మూసివేశారు. సాయంత్రం 4 గంటల వరకు వాటిని తెరవలేదు. దీంతో సంత వెలవెలబోయింది.



కశింకోటలో బోసిపోయిన రోజు వారీ సంత

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు



ప్రిన్సిపాల్ గ్రేస్

కశింకోట: తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ సోమవారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఆయా తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య, ఓసీ, బీసీలైతే 2014 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మించి ఉండరాదన్నారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం, ఎస్సీల నుంచి క్రిస్టియన్లుగా మారిన వారికి 12 శాతం వంతున సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తమ పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థి వయస్సు 2025 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించి ఉండరాదన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసి ఉండాలన్నారు. సీట్ల కేటాయింపులో 5వ తరగతి వలె రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరగనుందన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఇఖ్బఇజధ్భి ఇథిజటట.జీ వెబ్ సైట్ చిరునామా ద్వారా సమర్పించాలన్నారు.

ఐఐటీ మెడికల్ అకాడమీలో ...

బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీలో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను 1:3 నిష్పత్తిలో జాబితా తయారు చేస్తారని ప్రిన్సిపాల్ గ్రేస్ వివరించారు. వీరు ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్ పరీక్షకు హాజరు కావడానికిగాను తప్పనిసరిగా బీఆర్ఏజీ సెట్-2025 కోసం ఆన్‌లైన్ అడ్మిషన్ ఫారంలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లు, సీట్లు కేటాయించి ప్రవేశాలు కల్పిస్తారన్నారు. విద్యార్థి ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, సంప్రదించాల్సిన నంబర్లతో సమీప గురుకుల పాఠశాల లేదా ఇంటర్నెట్ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్లు 5వ తరగతి వారికి 8328409747, 9441075715, ఇంటర్మీడియట్ వారు 6301119688, 9490671262 సంప్రదించాలన్నారు.

4న మోదకొండమ్మ తీర్థం

మాడుగుల: వచ్చే నెల 4 వ తేదీన ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం అత్యంత వైభవంగా జరగనుందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. తీర్థ మహోత్సవం నిర్వహణకు సంబంధించి కమిటీ సోమవారం సమావేశం అయింది. ఈ ఏడాది తీర్థం అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.



పూలు, నగలతో అలంకరించిన మోదకొండమ్మ తల్లి

టొరెంటో ప్రమాదంపై ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సిటు నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని టొరెంటో పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి ఆర్డీవో సుధాకర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా పి.రామకృష్ణ, జె.బసవేశ్వరరావు అనే కాంట్రాక్టు కార్మికులు అస్వస్థతకు గురై, ఆస్పత్రి పాలయ్యారని ఆరోపించారు. కార్మికులకు మాస్కులు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



కాశీపురం హైస్కూల్‌లో దాతలు అందించిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు ఆదిరెడ్డి వరలక్ష్మి తన తాత ఆదిరెడ్డి సత్యం జ్ఞాపకార్థంగా పాఠశాల అభివృద్ధికి బావ ఆదిరెడ్డి నాయుడుతో కలిసి రూ.3,500 నగదుతో పాటు సుమారు రూ.5 వేలు విలువ చేసే క్రీడా సామాగ్రిని సమకూర్చారు. స్థానిక హైస్కూల్లో సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి చేతుల మీదుగా హెచ్ఎం సుందరికి నగదును, క్రీడా దుస్తులను సోమవారం అందజేశారు. దాతలను హెచ్ఎం తో పాటు సర్పంచ్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట, నేలకు మేలు



ఖండివరంలో రైతు పొలంలో ప్రకృతి సేద్యంలో సాగవుతున్న పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రకృతితో సాగుతో అటు నేలకు, ఇటు పంటకు ఎంతో మేలు జరుగుతుందని తద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ జి.దేముళ్లు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ఖండివరంలో 2020 నుంచి ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సూరెడ్డి చిన్నమ్మలు పొలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆమె సాగు చేస్తున్న నవధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ మేరకు సాగు విధానం, పెట్టుబడి, రాబడిపై ఆరా తీశారు. ప్రతి రైతు ప్రకృతి సాగువైపు రావాలని ఆయన కోరారు. ఈ మేరకు చిన్నమ్మలు మాట్లాడుతూ ప్రకృతి సాగుతో రసాయన ఎరువుల వాడకం తగ్గిందన్నారు. నేల నీటినిల్వ సామర్థ్యం పెరిగిందని గుర్తించామన్నారు. పంటలను ప్రతి సీజనకు మార్చి వేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగమణి, నాయుడుబాబు, శ్రీరామమూర్తి ఉన్నారు.

నేడు తంగుడుబిల్లిలో జిల్లాస్థాయి గుర్రాల పోటీలు

చీడికాడ : మండలంలోని తంగుడుబిల్లిలో అభయాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు అర్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2గంటలకు గుర్రపు పోటీలు ప్రారంభమౌతాయని, రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు



బోర్డును ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి జ్ఞానకేశ్వరబాబు

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి గ్రామంలో సర్వే నంబర్ 389/12 నుంచి 18 వరకు గల ప్రభుత్వ స్థలంలో పంచాయతీ కార్యదర్శి జ్ఞానకేశ్వరబాబు సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ స్థలంలో కొంతమంది కూటమి నాయకులు లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగించేందుకు చర్యలు చేపట్టారు. దాంతో జనవరి 7న గ్రామస్తులు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు పెట్టారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఆయన హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రభుత్వ స్థలంలో లేఅవుట్లు వేసి అమ్మకాలు, కొనుగోలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లయితే ఆయా ప్రాంతాల ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలి

- అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

అనకాపల్లి: గతంలో అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేసిన కాలానికి వేతనం చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు సమ్మె ప్రదేశానికి వచ్చి కూటమి అధికారం చేపట్టిన వెంటనే సమ్మె చేసిన 42 రోజులకు వేతనాలను చెల్లిస్తామని చెప్పిన వాగ్దానాన్ని తక్షణమే నిలబెట్టుకోవాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్‌గా మార్పు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు జీతాలు పెంచాలన్నారు. 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం సీడీపీవో కె.ప్రభావతికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాసులమ్మ, లక్ష్మి, మంగమ్మ, స్వాతి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో దిబ్బిడి విద్యార్థిని



యమునను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

బుచ్చెయ్యపేట: జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి హైస్కూల్ విద్యార్థిని శనివాడ యమున పాల్గొంది. మహారాష్ట్రలోని గ్వాలియర్ పట్టణం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ నెల 14 నుంచి జాతీయ స్థాయి రగ్బీ పోటీలు జరుగుతున్నాయి. 9వ తరగతి చదువుతున్న యమున జనవరిలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.